సాక్షి
నల్లగొండ
ఆదివారం । 9 । మార్చి । 2025



అడవిని హరిస్తున్న అగ్నికీలలు
నాగార్జునసాగర్ తీరం వెంట గల అమ్రాబాద్ ఫారెస్ట్ బఫర్ జోన్‌లో వారానికి రెండు చోట్ల మంటలు చెలరేగుతున్నాయి. - 8లో



భర్తకు తోడుగా..
మోటార్ సైకిల్‌పై తిరిగి కూరగాయలు అమ్ముతూ కుటుంబ పోషణలో భర్తకు తోడుగా ఉంటోంది నుగుణమ్మ. - 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-30 (ఆదివారం సా॥)
సహర్ 5-06 (సోమవారం ఉ॥)

న్యూస్‌రీల్

మిర్యాలగూడ సబ్ డివిజన్‌లో సీఐలు బదిలీ

మిర్యాలగూడ అర్బన్, మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ సబ్‌డివిజన్ పరిధిలో సీఐలను బదిలీ చేస్తూ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మిర్యాలగూడ రూరల్, టూ టౌన్ సీఐలుగా విధులు నిర్వహిస్తున్న వీరబాబు, నాగార్జునను మల్టీజోన్-2 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. వారి స్థానంలో రూరల్ సీఐగా పీఎన్‌డీ ప్రసాద్, టూటౌన్ సీఐగా జి.సత్యనారాయణను నియమించారు. మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ స్థానం గతేడాది కాలంగా ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం మోతీరాంను నియమించినట్లు సమాచారం.

రూరల్ ఎస్‌ఐగా లక్ష్మయ్య
మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో చేస్తున్న ఎస్‌ఐ పిల్లి లోకేష్‌కుమార్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో చౌటుప్పల్‌లో పనిచేస్తున్న లక్ష్మయ్య మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐగా రానున్నారు.

బుచ్చిరెడ్డికి బాలసాహిత్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బుచ్చిరెడ్డి

కనగల్ : మండలంలోని చిన్నమాధారం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి 2025 సంవత్సరానికి ఉత్తమ బాలసాహిత్య పురస్కారం లభించింది. శనివారం వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో కునిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివ చంద్రారెడ్డి, డికె. చదువుల బాబు, సాహితీవేత్త నరాల రామారెడ్డి మెమొంటో, సన్మాన పత్రం, శాలువతో బుచ్చిరెడ్డిని సన్మానించారు. బుచ్చిరెడ్డి రాసిన బంతిపూలు పుస్తకానికి బాలసాహిత్య పురస్కారం అందజేశారు. బుచ్చిరెడ్డికి పురస్కారం లభించడంపై పాఠశాల జీహెచ్‌ఎం వల్లంపట్ల పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

జేఎల్ పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, జూనియర్ లెక్చరర్లు

నల్లగొండ : జూనియర్ లెక్చరర్లకు పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 11న హైదరాబాద్‌లోని నిర్వహించనున్న ధర్నాకు సంబంధించి పోస్టర్‌ను శనివారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2022లో వచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి 2023లో పరీక్షలు నిర్వహించి 2024లో ఫలితాలు విడుదల చేశారని.. 2025 ఫిబ్రవరి 19న కళాశాలలు కేటాయించారని.. కానీ పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, రవీందర్, గోవర్ధన్, పందిరి శ్యాంసుందర్, ఎండీ.అబ్దుల్ ఖాదర్, గుండాల భిక్షమయ్య, దాసరి శ్రీరాములు, కే.చంద్రశేఖర్‌రెడ్డి, వి.లింగస్వామి, చిరుమర్తి వెంకటేష్, వి.హనుమంతు, ఎన్.వీరారెడ్డి, ఎండీ.ఫాతిమా బేగం తదితరులు పాల్గొన్నారు.

లక్ష సంతకాల సేకరణ ప్రారంభం

భువనగిరి టౌన్ : వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వివిధ రాజకీయ పదవుల్లో దివ్యాంగులను నామినేట్ చేయడానికి వీలుగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది దివ్యాంగుల నుంచి సంతకాలు సేకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే భువనగిరి నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు సుర్వంగ ప్రకాష్, కోశాధికారి కొత్త లలిత తదితరులు పాల్గొన్నారు.

• మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవం సందర్భంగా నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిని సన్మానిస్తున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

• ఇందిరమ్మ గృహం



నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని శనివారం ప్రారంభిస్తున్న మంత్రులు, శాసనమండలి చైర్మన్, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు

తాగునీటి సమస్య రావొద్దు



నల్లగొండ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అధికారులు

- అధికారులు మనసు పెట్టి పనిచేయాలి
- నీటి సమస్య తలెత్తితే తక్షణమే పరిష్కరించాలి
- అందుకు కలెక్టర్ వద్ద నిధులు ఉంచుతాం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


నల్లగొండ : వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా అధికారులు మనసు పెట్టి పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో సాగు, తాగునీరు, విద్యుత్‌పై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో సాగు, తాగునీరు, విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ వేసవిలో తాగు, సాగు నీరు, విద్యుత్ ఇబ్బందులు ఏర్పడకుండా ఫిబ్రవరిలో సమావేశం నిర్వహించుకోవాల్సి ఉన్నా ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యమైందన్నారు. ఈ మూడు శాఖలకు చెందిన పైస్థాయి నుంచి కింది స్థాయి అధికారుల వరకు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఇందులో పోలీస్, రెవెన్యూ అధికారులను భాగస్వామ్యం చేయాలన్నారు. వేసవిలో ఏర్పడే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కలెక్టర్ల వద్ద కొంత నిధి ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యేల వద్ద కూడా నిధులు అందుబాటులో ఉంచేలా ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను కృష్ణాలో అనుసంధానం చేసే ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించుకునే విషయంలో కూడా అధికా రులు దృష్టి సారించాలన్నారు. ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి నివేదిక ఇవ్వాలని కలెక్టర్లు వీటిపై దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు.

కాల్వల నిర్వహణ సరిగాలేదు : గుత్తా



శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రాజెక్టులకు సంబంధించిన కాల్వల నిర్వహణ సరిగా లేదన్నారు. ఏఎమ్మార్పీ కాల్వ లైనింగ్ చేపట్టాలన్నారు. కాల్వల్లో రైతులు పెద్ద మోటార్లు వేసి నీరును లాగడం వల్ల చివరి భూములకు నీరు అందడం లేదన్నారు. విద్యుత్ కనెక్షన్ల మంజూరులో అధికారులు ఆచితూచి వ్యవహరించాలని సూచించారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలి : మంత్రి కోమటిరెడ్డి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే దశలో ఉన్నాయని.. ఎకరం పొలం కూడా ఎండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ లోడ్ పెరిగి లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమవుతోందని.. ఆ సమస్యను వెంటనే పరిష్కరించి రైతులకు ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. కలెక్టర్లు తాగునీటిపై దృష్టి సారించాలని, ప్రతి పంచాయతీకి రూ.15 వేల వరకు అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి తాగునీటి అవసరాలకు ఖర్చు చేయాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంత రావు, తేజస్ నందులాల్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఎన్‌సీ హరిలాల్, సీఈ అజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ వెంకటేశ్వర్లు, నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ల మరమ్మతుకు నిధులివ్వాలి



జిల్లాలో తాగు, సాగు, విద్యుత్ ప్రస్తుత పరిస్థితులను వివరించారు. రోజూ 140 మిలియన్ లీటర్ ఫర్ డే (ఎంఎల్‌డీ) తాగునీరు అవసరం అవుతోందన్నారు. విలీన గ్రామాల్లో తప్ప ఎక్కడా సమస్యలు లేవన్నారు. పైపులైన్ల మరమ్మతులకు ఎస్‌డీఎఫ్ కింద రూ.30 కోట్లు ఇవ్వాలి.
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

కార్యదర్శులు తిప్పలు పడుతున్నారు



ప్రత్యేక అధికారులు గ్రామాలకు రావడం లేదు. నిధులు లేక కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోతే వారు పనులు చేయలేదు. దేవరకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంటుంది. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసినా ట్యాంకర్ల కిరాయి కూడా చెల్లించకపోవడంతో ఎవరూ ముందుకు రావడం లేదు. పెండ్లిపాకల ప్రాజెక్టును ఏజెన్సీలు పట్టించుకోవడం లేదు.
- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

అత్యవసర నిధులు ఇవ్వాలి




వేసవిలో అత్యవసర పనుల కోసం ఎమ్మెల్యేల వద్ద కొంత నిధిని ఏర్పాటు చేయాలి. వేసవిలో కృష్ణా జలాలు మాత్రమే అందించడం కష్టం. ట్యాంకర్ల ద్వారా వ్యవసాయ బోర్ల నుంచి నీటిని సరఫరా చేయాలి. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వ పనులకు నిధులు మంజూరు చేయడం హర్షణీయం.
- నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

అద్దె బోర్ల రేటు పెంచాలి



తాగునీటి కొరత వల్ల గత సంవత్సరం ప్రజలు ఇబ్బంది పడ్డారు. తండాలో బోర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. అద్దె బోర్ల ధరలు పెంచాలి. నిడమనూరు చెరువు నింపాలి.
- సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

భగీరథ ఏజెన్సీకి బకాయిలు చెల్లించాలి



మిషన్ భగీరథ ఏజెన్సీకి బకాయిలు చెల్లించాలి. మిర్యాలగూడ నియోజకవర్గంలో తండాలు ఎక్కువగా ఉన్నాయి. గత సంవత్సరం అద్దె బోర్లకు చెల్లించిన మొత్తాన్ని విడుదల చేయాలి. డి-40 కింద సాగునీరు రావడం లేదు.
- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

నీరు వదిలి పంటను కాపాడాలి



ఎస్సారెస్పీ నీరు సరిగా అందక పంట పొలాలు ఎండిపోయి. మా ప్రాంత రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నీటిని సక్రమంగా విడుదల చేసి ఆ పంటలను కాపాడాలి. అడ్డగూడూర్‌లో అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్ చేయడం లేదు. మోత్కూర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి.
- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

ఆర్‌ఓబీలు మంజూరు చేయాలి

- రైల్వే శాఖ మంత్రికి కోమటిరెడ్డి వినతి

నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలను మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్‌లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. మంత్రి సీతక్క, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి రైల్వే మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రైళ్ల రాకపోకల సమయంలో లెవల్ క్రాసింగ్‌ల వద్ద గేట్లు మూసివేయడం వల్ల రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని కోరారు. నల్లగొండ జిల్లా రాయనిగూడెం వద్ద, నల్లగొండలోని ఎఫ్‌సీఐ గోడౌన్ నుంచి పెద్దబండ నాంరోడ్డు వద్ద, నార్కట్‌పల్లి - మునుగోడు రోడ్డులో, దామరచర్ల - వీర్లపాలెం రోడ్డులో, త్రిపురారం - కుక్కడం రోడ్డులో, యాదాద్రి జిల్లా చౌటుప్పల్ - నాగారం రోడ్డులో, పగిడిపల్లి - భువనగిరి రోడ్డులో, ముత్తిరెడ్డిగూడెంలోని భువనగిరి - రాయగిరి రోడ్డులో, వలిగొండ - రామన్నపేట రోడ్డులోని కిలోమీటర్ 16/8 నుంచి 17/0 వరకు, రామన్నపేట-చిట్యాల జంక్షన్‌లోని కిలోమీటర్ 0/4-6 వద్ద, చిట్యాల మున్సిపాలిటీ కాటన్ రైస్ ఇండస్ట్రీస్ రోడ్డులో.. ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.



రైల్వే మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రాజీ మార్గంతో కేసులకు శాశ్వత పరిష్కారం

రామగిరి(నల్లగొండ) : రాజీ మార్గంతో కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయలోక్ అదాలత్ నిర్వహించారు. నల్లగొండ కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు లోక్ అదాలత్‌ను ప్రారంభించి కక్షిదారులకు రాజీ పత్రాలను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా సివిల్ 40, క్రిమినల్ 5,807, వెహికిల్ ఇన్సూరెన్స్ 95, బ్యాంక్ 3, సైబర్ క్రైం 29, ట్రాన్స్‌కో 100, ట్రాఫిక్ చలాన్ 12,879 కేసులను పరిష్కరించారు. ఇందులో ఇన్సూరెన్స్ కేసుల్లో రూ.4,30,82,000 నష్ట పరిహారం ఇప్పించారు. ఇతర కేసుల్లో రూ.2,58,456 రికవరీ చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



రాజీపత్రం అందజేస్తున్న జడ్జి

నయన మనోహరం.. నృసింహుడి కల్యాణం

- యాదగిరిగుట్టలో వైభవంగా శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణ మహోత్సవం

యాదగిరిగుట్ట : యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీనరసింహుడి తిరుకల్యాణోత్సవం శనివారం రాత్రి వైభవంగా సాగింది. పట్టువస్త్రాలు, వజ్రవైడూర్యాలు, బంగారు ఆభరణాలతో పెళ్లికొడుకుగా ముస్తాబైన శ్రీస్వామివారు గజవాహనంపై, నవ వధువుగా శ్రీలక్ష్మీదేవి దివ్య అలంకార శోభితమై ప్రత్యేక పల్లకిలో రాత్రి 8.30 గంటలకు ఊరేగింపుగా బయలుదేరి 9 గంటలకు ఉత్తర మాడ వీధిలో ఏర్పాటు చేసిన కల్యాణవేదికపైకి చేరుకున్నారు. కల్యాణ వేదికపై శ్రీస్వామి, అమ్మవారిని ఎదురెదురుగా అధిష్టింజేసిన అర్చకులు.. కల్యాణానికి శ్రీకారం చుట్టారు. అర్చకబృందం, వేదపండితులు, పారాయణీకులు వేదమంత్రాలు, పారాయణాలు పఠిస్తుండగా ప్రధానార్చకులు శ్రీస్వామివారికి జంజరాధారణ (యజ్ఞోపవీతం)గావించారు. ఆ వెంటనే నృసింహుడు అమ్మవారికి, అమ్మవారు నృసింహుడికి జీలకర్ర బెల్లం పెట్టే తంతు పూర్తి చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, సన్నాయి మేళాలు మోగుతుండగా, భక్తులు జయజయధ్వానాల మధ్య మాంగల్యధారణ గావించి ముత్యాల తలంబ్రాల వేడుక నిర్వహించారు.



గజవాహనం, పల్లకిపై కల్యాణ మండపానికి ఊరేగింపుగా వస్తున్న శ్రీస్వామి, అమ్మవారు

పట్టువస్త్రాల సమర్పణ
రాష్ట్ర ప్రభుత్వం తరఫున, టీటీడీ తరఫున, భూదాన్ పోచంపల్లి తరఫున, భక్తుల తరఫున తీసుకువచ్చిన పట్టు వస్త్రాలతో అలంకార సేవలో ప్రజాప్రతినిధులు, ఆలయాధికారులు, భక్తులు నడిచారు.

ఉదయం శ్రీరాముడిగా దర్శనం
శనివారం ఉదయం ప్రధానాలయంలో నిత్యారాధనలు పూర్తయిన అనంతరం స్వామివారిని శ్రీరాముడిగా అలంకరించి హనుమంత వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, వెంకటాచార్యులు పాల్గొన్నారు.



కల్యాణతంతులో భాగంగా మంగళసూత్రం చూపుతున్న ప్రధానార్చకులు

• అవ్వాతాతల ఆటాపాట



ఓ అమ్మమ్మ డ్యాన్స్ చేస్తుండగా చప్పట్లతో ప్రోత్సహిస్తున్న అవ్వాతాతలు

నల్లగొండ పట్టణ శివారులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్‌కు ఆటాపాట నిర్వహించారు. పలు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన అవ్వాతాతలకు బహుమతులు అందజేశారు.
- నల్లగొండ టౌన్



పిల్లలను ఎత్తుకుని పరుగు తీస్తున్న అమ్మమ్మ, నానమ్మలు

పంచాయతీరాజ్‌లో ప్రత్యేక నియామకాలు

- మొదటిసారిగా సూపర్ న్యూమరరీ పోస్టులు
- ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాల్లో.. జూనియర్ అసిస్టెంట్లుగా..
- ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 59 మందికి మేలు

నల్లగొండ : పంచాయతీరాజ్ శాఖలో ప్రత్యేక నియామకాలు చేపడుతున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాల్లో.. సూపర్ న్యూమరరీ పోస్టుల ద్వారా జూనియర్ అసిస్టెంట్లను భర్తీ చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పెద్ద చదువులు చదివి ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాల్లో చేకుండా జూనియర్ అసిస్టెంట్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న మేలు కలగనుంది. నియామకాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన శనివారం చేపట్టారు.

ఎళ్లుగా ఎదురుచూపులు
పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగులు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇస్తారు. ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో ఎక్కువ శాతం ఆఫీస్ సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చనిపోయిన వారి పిల్లల్లో కొందరు ఇంజనీరింగ్, పీజీ ఈ పోస్టుల్లో జాయిన్ కాకుండా.. జూనియర్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీ అయితే వాటిల్లో చేరేందుకు ఎదురుచూస్తున్నారు. అయితే కొన్నాళ్లుగా ఏటా ఒకరిద్దరు పదవీవిరమణ పొందితే ఆ స్థాయిలోనే ముందు వరుసలో ఉన్న వారికి ఉద్యోగాలు వస్తున్నాయి. దీంతో కొందరు పదేళ్లకుపైగానే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎదురు చూస్తున్నారు. ఇక.. కొందరు కుటుంబ పోషణ కోసం ఆఫీస్ సబార్డినేట్ విధుల్లో చేరుతున్నారు.



59 పోస్టుల్లో జూనియర్ అసిస్టెంట్లు..
జిల్లాలో 59 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను సూపర్ న్యూమరరీ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ప్రస్తుతం ఆఫీస్ సబార్డినేట్ ఖాళీల్లో సూపర్ న్యూమరరీ పద్ధతిలో జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు ఇస్తుంది. ఈ సూపర్ న్యూమరరీ ద్వారా జూనియర్ అసిస్టెంట్లుగా చేరుతున్న వారిని భవిష్యత్‌లో జూనియర్ అసిస్టెంట్ రెగ్యులర్ పోస్టు ఖాళీ అయితే సీనియారిటీ ప్రకారం ఆ పోస్టుల్లోకి మార్చుతారు.

పదోన్నతులు లేకపోవడమే..
ప్రస్తుతం ఆఫీస్ సబార్డినేట్‌గా చేరినా.. పదోన్నతులు వస్తాయనే ఆశ లేదు. 20 ఏళ్లు గడిచిన వారికి కూడా జూనియర్ అసిస్టెంట్ పదోన్నతి లభించక ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటంతో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో జిల్లా పరిషత్ సీఈఓలు, ఇతర అధికారులు, సంఘ నాయకులు కలిసి ప్రభుత్వానికి విన్నవించడంతో.. ప్రభుత్వం సూపర్ న్యూమరరీ పోస్టులను భర్తీ చేసేందుకు సిద్ధమైంది.



యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో శ్రీరామ అలంకారంలో హనుమంత సేవను ఊరేగిస్తున్న అర్చకులు, స్వాగతం పలుకుతున్న కళాకారులు



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న విప్ ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్, ఈఓ తదితరులు



స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు అలంకరిస్తున్న అర్చకులు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో భాగంగా స్వామి, అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం పెడుతున్న అర్చకులు

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

డిండి: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం డిండి పట్టణానికి చెందిన కొలువుల మల్లయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్ గ్రామానికి చెందిన అవుజ హరీష్ చోరీకి పాల్పడి 6.5 తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. పొలం పనులు ముగించుకొని మల్లయ్య ఇంటికి వచ్చేసరికి తాళం పగుల గొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం ఉదయం స్థానిక బస్టాండ్‌లో నిందితుడు హరీష్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. మల్లయ్యకు హరీష్ సమీప బంధువని, గతంలో పలు చోరీ కేసుల్లో హరీష్ నిందితుడిగా ఉన్నాడని ఎస్‌ఐ పేర్కొన్నారు.

అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు



ఘటనా స్థలంలో కారు

మోటకొండూర్: మండలంలోని కాటేపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద శనివారం కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఎస్‌ఐ నాగుల ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరికి చెందిన జయశంకర్ పల్లెర్ల ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం భువనగిరి నుంచి కారులో పాఠశాలకు వెళ్తుండగా.. మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. కారుకు మాత్రం ధ్వంసమైంది. రోడ్డు సరిగా లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపాడు.

అడవిని హరిస్తున్న అగ్నికీలలు

- నల్లమల, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ బఫర్ జోన్‌లో చెలరేగుతున్న మంటలు
- ప్రతీ వారం ఎక్కడో ఒకచోట తగలబడుతున్న అటవీ ప్రాంతం
- అడవిలో జీవాలను మేపడం నిషేధించిన అటవీ శాఖ అధికారులు



టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ బఫర్ జోన్‌లో కాలిపోతున్న అడవి (ఫైల్)

నాగార్జునసాగర్: సాగర్ జలాశయం తీరం వెంట గల అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ బఫర్ జోన్‌లో వారానికి రెండు చోట్ల మంటలు చెలరేగుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ అగ్నిప్రమాదాలు ఆగడం లేదు. గత కొన్నేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. గత వారం రెండ్లు సార్లు కృష్ణా నది తీరంలో జమ్మనకోట ప్రాంతంలో రాత్రివేళ అడవికి నిప్పంటుకుంది. వెంటనే స్పందించిన అటవీశాఖ అధికారులు దగ్గరలో గల తండావాసుల సహకారంతో చెట్ల కొమ్మలతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఒకసారి సుమారు 8 నుంచి 10ఎకరాల మేర, రెండోసారి 2 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం కాలిపోయింది. అటవీ ప్రాంతంలో రాలిపోయిన ఆకులతో పాటు చిన్న చిన్న చెట్లు తగలబడ్డాయి. రెండేళ్ల క్రితం కూడా దయ్యాలగండి సమీపంలోని అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగడంతో అధికారులు సకాలంలో స్పందించి ఆర్పివేశారు. అదేవిధంగా నల్లమల అటవీ ప్రాంతంలో నాగాలారం ప్రాంతంలో మూడేళ్ల క్రితం మంటలు అంటుకొని 100 ఎకరాల మేర అడవి తగలబడింది.

అటవీ ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు..

అటవీ ప్రాంతాల్లోకి బయటి వ్యక్తులు, పశువుల కాపరులు ప్రవేశించడంపై నిషేధం విధించినట్లు అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. అడవుల్లో చెట్ల ఆకులు రాలడంతో పాటు వేసవిలో ఎండలు మండుతున్న దృష్ట్యా నల్లమల, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలోని గ్రామాల్లో కళాజాతతో ప్రచారం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. నల్లగొండ–మహబూబ్‌నగర్ జిల్లాల మధ్యన కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో 2,166 చదరపు కిలోమీటర్ల మేర అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ విస్తరించి ఉంది. ఫిబ్రవరి నుంచి మే నెల వరకు ఆకు రాలే సమయం కావడంతో తరచూ ఇక్కడ అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. దీంతో అడవిలో నివసించే జంతువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

తీసుకోవాల్సిన చర్యలు

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తుగానే అటవీ ప్రాంత శివారులో నివసించే ప్రజలకు అవగాహన కల్పించాలి. అడవిలోకి వేసవిలో జీవాలను, పశువులను రాకుండా చూడాలి. అగ్గిపెట్టె, కిరోసిన్, పెట్రోల్ లాంటి వాటిని అడవిలోకి తీసుకురాకుండా నిషేధించాలి. అడవిలో ఆకులు రాలే చోట ట్రంచులు ఏర్పాటు చేయాలి. చెక్‌డ్యాంలు నిర్మించి నీరు నిల్వ ఉండేలా చూడాలి. అవసరమైన సమయంలో ఆ నీటిని మంటలార్పేందుకు వాడుకునేలా చర్యలు తీసుకోవాలి. ఎత్తైన వాచ్ టవర్లు ఏర్పాటు చేసి వేసవిలో మనుషులు అడవిలోకి రాకుండా గమనించాలి.

అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం



అటవీ ప్రాంతంలో తరచూ మంటలు లేచే ప్రాంతాలను గుర్తించి ఫైర్ ట్రస్సింగ్ లైన్లు కొట్టించాం. బఫర్ జోన్‌లో రహదారులకు ఇరువైపులా కంపచెట్లు తొలగించాం. చాలా చోట్ల ఫైర్‌వాల్స్ కూడా ఏర్పాటు చేశాం. అటవీ శివారు గ్రామాల్లో బేస్ క్యాంప్ హెల్పర్లు 24గంటలు కాపలాగా ఉంటారు. ఈ వేసవిలో జీవాలు అడవిలోకి వెళ్లకుండా నిషేధించాం. శివారు తండాలు, గ్రామాల ప్రజలకు అగ్నిప్రమాదాలు సంభవించకుండా అవగాహన కల్పిస్తున్నాం.

– రాఘవేందర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, నాగార్జునసాగర్

కుటుంబ పోషణలో భర్తకు తోడుగా..

- ఊరూరా తిరిగి మోటార్ సైకిల్‌పై కూరగాయలు అమ్ముతున్న భార్య



మాసారపు సుగుణమ్మ



మోటార్ సైకిల్‌పై వెళ్లి కూరగాయలు విక్రయిస్తున్న మాసారపు సుగుణమ్మ

ఆత్మకూర్ (ఎస్): కుటుంబ పోషణలో భర్తకు చేదోడు వాదోడుగా ఉండేందుకుగాను ఊరూరా మోటార్ సైకిల్‌పై తిరిగి కూరగాయలు అమ్ముతూ ఆదర్శంగా నిలుస్తోంది మాసారపు సుగుణమ్మ. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామానికి చెందిన మాసారపు సుగుణమ్మ, స్వామి భార్యాభర్తలు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. చిన్న అమ్మాయి మానసిక వికలాంగురాలు. వీరికి వ్యవసాయ భూమి లేకపోవడంతో భర్త స్వామి సూర్యాపేట నుంచి కూరగాయలు హోల్‌సేల్‌గా తెచ్చి గ్రామంలో వీధి వీధి తిరుగుతూ అమ్ముతున్నాడు. అతనొక్కడి సంపాదనపై ఆధారపడి కుటుంబ పోషణ ఇబ్బందిగా మారడంతో సుగుణమ్మ అదే గ్రామంలో గంప నెత్తినెత్తుకొని కూరగాయలు అమ్మేది. ఈ క్రమంలో ఇద్దరు బిడ్డల పెళ్లిళ్లు చేశారు. అయితే సుగుణమ్మకు మోకాళ్లు, మెడ నొప్పులు రావడంతో కూరగాయల గంప నెత్తినెత్తుకొని తిరగడం ఇబ్బందిగా మారడంతో సైకిల్‌పై చుట్టుపక్కల గ్రామాలు వెళ్లి కూరగాయలు అమ్మేది. సైకిల్‌పై తిరగడం కూడా ఇబ్బందిగా ఉంటుండటంతో వారి కుమార్తె ఎనిమిది నెలల క్రితం టీవీఎస్ ఎక్సెల్ బైకులు కొనిచ్చింది. ఈ మోటార్ సైకిల్‌కు మూడు చక్రాలు అమర్చారు. దీంతో సుగుణమ్మ కూరగాయలను ఈ బండిపై పెట్టుకొని నెమ్మికల్‌తో పాటు 7, 8 కిలోమీటర్ల దూరం దాకా వెళ్లి వ్యాపారాన్ని కొనసాగించి కుటుంబ పోషణలో భర్తకు తోడుగా నిలుస్తోంది. ఇలా భార్యాభర్తలు కూరగాయలు విక్రయించి రోజుకు రూ.800 నుంచి రూ.1000 రూపాయల వరకు సంపాదిస్తున్నారు. కూరగాయలు అమ్మి కుటుంబాన్ని పోషించుకోవడం సంతోషంగా ఉందని సుగుణమ్మ తెలిపింది.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: తెలంగాణ రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని ఓ హోటల్‌లో జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సం కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల వరకు రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు 150కి పెరిగితే ఉంటే అందులో 50 మంది మహిళలే ఎమ్మెల్యేలుగా ఉంటారన్నారు. మహిళా బిల్లు కూడా త్వరలో అమలవుతుందని పేర్కొన్నారు. బీసీ కుల గణనతో 42శాతం బీసీలకు రిజర్వేషన్ వర్తిస్తుందని అన్నారు. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఉచిత బస్సు సౌకర్యం, మహిళా సంఘాలకు క్యాంటీన్ల నిర్వహణ వంటి అవకాశాలు కాంగ్రెస్ ప్రభుత్వ కల్పించిందన్నారు. త్వరలో 1000 కొత్త ఆర్టీసీ బస్సుల మెయింటెనెన్స్‌ను మహిళా సంఘాలకు అప్పగిస్తామన్నారు. జిల్లాలోని మహిళా సంఘాలకు 50 బస్సులను కేటాయించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, రూ.500కే సిలిండర్ అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులను, మహిళా కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, వంగూరి లక్ష్మయ్య, మహిళా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబ్బ రూపఅశోక్‌సుందర్, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే జాను, పట్టణ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కందిమల్ల నాగమణిరెడ్డి, జిల్లా కార్యదర్శి లలిత, సదాలక్ష్మి, సంకు ధనలక్ష్మి, విజయలక్ష్మి, కంచర్ల మాధవి, జూలకంటి ధనలక్ష్మి, సూరెడ్డి సరస్వతి, స్వరూప రెడ్డి సౌజన్య, సుకన్య, నిర్మలాదేవి, సువర్ణ, పద్మలు పాల్గొన్నారు.

పాల బిల్లులు చెల్లించాలని ధర్నా



పాల కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న పాడి రైతులు

ఆత్మకూరు(ఎం) : మదర్ డెయిరీ, విజయ డెయిరీలు బకాయి బిల్లుల చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆత్మకూర్(ఎం) మండలంలోని కూరెళ్ల పాల కేంద్రం ఎదుట శనివారం పాడి రైతులు ధర్నా చేశారు. రెండు డెయిరీల నుంచి రూ.85 కోట్లు రావాల్సి ఉందని, నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడం వల్ల పాడిపరిశ్రమ నిర్వహణ ఇబ్బందికరంగా మారిందన్నారు. పాడి పరిశ్రమను ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. దేశీయ పాలను కాకుండా విదేశాలనుంచి కేంద్రం పాలను దిగుమతి చేసుకోవడం వల్ల పాడి రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తుందన్నారు. ఈనెల 10లోగా బిల్లులు చెల్లించని పక్షంలో 11వ తేదీన కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని పాడి రైతులంతా కలిసి ధర్నా చేయనున్నట్లు వెల్లడించారు. ధర్నాలో వేముల భిక్షం, రైతులు తుమ్మలగూడెం యాదయ్య, నార్కట్‌పల్లి మల్లయ్య, మొరుగాని శ్రీనువాస్, కన్నెబోయిన శంకరయ్య, జోగు కుమార్, బాషబోయిన నరేష్, ఎండి షకీల్, మారుపాక పరుశరాములు, ఐలమ్మ, సోమక్క అండాలు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఉరేసుకొని ఆత్మహత్య



సతీష్ (ఫైల్)

అడ్డగూడూరు: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. శనివారం ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కోటమర్తి గ్రామానికి చెందిన నిమ్మల సతీష్(35)కు తొమ్మిదేళ్ల క్రితం తిరుమలగిరి మండలం గూడెపురి గ్రామానికి చెందిన స్వప్నతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. తనకు కుమారుడు పుట్టలేదని సతీష్ తాగి వచ్చి తరచూ భార్య స్వప్నతో గొడవపడుతుండేవాడు. ఈ నెల 5వ తేదీన సైతం స్వప్నతో గొడవపడి కొట్టడంతో ఆమె తన కుమార్తెలను తీసుకుని తల్లిగారింటికి వెళ్లింది. మరుసటి రోజు స్వప్న తల్లి కుమార్తెను తీసుకుని కోటమర్తికి వచ్చి అల్లుడికి నచ్చజెప్పింది. శుక్రవారం రాత్రి సతీష్, స్వప్న, ఇద్దరు పిల్లలు ఒక గదిలో, స్వప్న తల్లి మరో గదిలో నిద్రించారు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో సతీష్ బెడ్‌షీట్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం తెల్లవారుజామున స్వప్న తల్లి ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా.. సతీష్ ఉరికి వేలాడుతుండటం గమనించి బిగ్గరగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి అప్పటికే సతీష్ మృతిచెందాడు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి నీటి ప్రణాళిక లేదు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట టౌన్: ప్రభుత్వానికి నీటి ప్రణాళిక లేదని, జల విధానం తెలియదని, నీళ్లు ఇవ్వాలన్న కనీస సోయి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు వ్యతిరేక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, సీఎంకు డబ్బులు దోచుకోవడం ఒక్కటే తెలుసన్నారు. కమిషన్లతో కాలం వెల్లదీస్తున్నారని, రాష్ట్రంలో 20 శాతం కమిషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. స్వయంగా సచివాలయంలో కాంట్రాక్టర్లు ధర్నాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ వచ్చింది కరువు తెచ్చింది అని ప్రజలు అనుకుంటున్నారని, ఈ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ప్రాజెక్టుల్లో నీళ్లు ఉండి కూడా కాంగ్రెస్ నాయకుల అజ్ఞానం వల్ల పొలాలకు నీళ్లు రావడం లేదని, గోదావరి, కృష్ణా నదుల్లో సరిపడా నీళ్లు ఉన్నా ఇవ్వడం చేతకావడం లేదని విమర్శించారు. కాల్వల్లో నీళ్లు రాక ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నాయని, అయినా ప్రభుత్వానికి సోయి లేదని ధ్వజమెత్తారు. కరెంట్ కూడా సరిగా ఇవ్వడం లేదని, రాష్ట్రంలో 2014 కంటే ముందు ఉన్న పరిస్థితులు మళ్లీ వచ్చాయన్నారు. ఇసుక దోపిడీ కోసం కాళేశ్వరం లిఫ్టులను నడపడం లేదని, గోదావరి నీళ్లు తీసుకుపోతాం అని చంద్రబాబు అంటే కూడా తెలంగాణ సీఎంలో చలనం లేదన్నారు. దీనిపై తెలంగాణ మంత్రులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

పాతర్లపహాడ్‌లో విషాదఛాయలు

- ఏపీలోని నెల్లూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన అక్క, తమ్ముడు మృతి



నిషిత (ఫైల్)



కార్తీక్ (ఫైల్)

నెల్లూరు క్రైం, ఆత్మకూర్(ఎస్): ఏపీలోని నెల్లూరు పట్టణంలోని శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన అక్క, తమ్ముడు మృతిచెందారు. దీంతో పాతర్లపహాడ్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన మోహనంది మల్లయ్య, నాగమణి దంపతులకు నిషిత (22), కార్తీక్ (20) సంతానం. మల్లయ్య సూర్యాపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుమార్తెను బీటెక్, కుమారుడిని డిప్లొమా చదివిస్తున్నాడు. ఇటీవల నిషిత సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందడంతో మొక్కు చెల్లించుకునేందుకు కుటుంబంతా కలిసి తిరుపతికి వెళ్లారు. ఈ నెల 6న తిరుమలకు వెళ్లిన వారు.. దర్శనానంతరం తిరిగి తమ ఊర్లోకేందుకు తిరుపతికి శుక్రవారం అర్ధరాత్రి చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌కు బయల్దేరగా మార్గమధ్యలో ఇన్నోవా కారు డ్రైవర్ కలిసి తాను విజయవాడకు వెళ్తున్నానని చెప్పారు. దీంతో వీరు కారులో బయల్దేరారు. మార్గమధ్యలో నెల్లూరు పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీ జంక్షన్ వద్దకు రాగానే కారు డ్రైవర్ నిద్రమత్తులో డివైడర్‌ను ఢీకొని ఆపై లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నిషిత, కార్తీక్ అక్కడికక్కడే మృతిచెందగా, వారి తల్లిదండ్రులు, కారు డ్రైవర్ శివరామకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో హాస్పిటల్‌కు తరలించారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం

- కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

మద్దిరాల: నెలరోజుల క్రితం అదృశ్యమైన మద్దిరాల మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన ఆశ వర్కర్ కుందూరు వసంత ఆచూకీ శనివారం లభ్యమైంది. ఎస్‌ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. వసంత నల్లగొండ సమీపంలో కిందపడడంతో ఆమె తలకు గాయామై మతిస్థిమితం కోల్పోయింది. ఆమెను ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. ఆమె ఎలాంటి వివరాలు చెప్పలేని స్థితిలో ఉండడంతో నల్లగొండలోని ఓ ఆశ్రమంలో ఉంచారు. ఇటీవల అక్కడి పోలీసులు సమాచారం అందించడంతో ఆమెను కుందూరు వసంతగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు శనివారం అప్పజెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు. వసంత ఆచూకీ కనిపెట్టిన పోలీసులకు, ఆశ్రమ నిర్వాహకులకు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



వసంతను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ వీరన్న

అమృత్ మహోత్సవ్‌లో చేనేత కళాకారులు



సంస్థాన్ నారాయణపురం: చేనేత వస్త్రాల తయారీని రాష్ట్రపతికి వివరిస్తున్న గూడ శ్రీను



రామన్నపేట: జెల్ల సత్యనారాయణ స్టాల్‌ను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

సంస్థాన్ నారాయణపురం: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శనివారం నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం తరఫున సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన చేనేత కళాకారులు గూడ శ్రీను, ఆయన కుమారుడు పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత ప్రాచీన కళ తేలియారూమాల్ వస్త్రం రూపొందించడాన్ని గూడ శ్రీను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చూపించారు. వారిని రాష్ట్రపతి అభినందించినారు. కార్యక్రమంలో కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రి గిరిజాసింగ్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు.

సిరిపురం చేనేత వస్త్రాల ప్రదర్శన

రామన్నపేట: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన కళాభారతి హ్యాండ్లూమ్ హ్యాండ్‌క్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీకి చెందిన జెల్ల సత్యనారాయణ, జెల్ల శ్రీనాథం పోచంపల్లి పట్టుచీరలు, మెర్స్‌రైజ్డ్ చీరలు, బెడ్‌షీట్లు, డ్రెస్ మెటీరియల్, చున్నీలను రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్టాల్‌ను సందర్శించి సత్యనారాయణ, శ్రీనాథంను అభినందించారు.

'ఇక్కత్'ను పరిశీలించిన రాష్ట్రపతి

భూదాన్‌పోచంపల్లి: రాష్ట్రపతి భవన్‌లో అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ నుంచి ఏర్పాటు చేసిన హస్తకళల ఎగ్జిబిషన్‌ను శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, తెలంగాణ ఉప ముఖ్యమంతి భట్టి విక్రమార్క సందర్శించారు. పోచంపల్లికి చెందిన రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత ఎన్నం మాధవిశివకుమార్ ఏర్పాటు చేసిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను వారు పరిశీలించారు. కళాత్మకమైన ఇక్కత్ డిజైన్లు, నాణ్యత, పోచంపల్లి ఇక్కత్‌కు అంతర్జాతీయంగా ఉన్న గుర్తింపును తెలుసుకొని రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారని చేనేత కళాకారిణి ఎన్నం మాధవి శివకుమార్ తెలిపారు.



భూదాన్‌పోచంపల్లి: ఇక్కత్ వస్త్రాలను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము